# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..








# ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



- విద్యార్థులతో ముఖాముఖి
- భోజనం, వసతి, విద్యా సౌకర్యాలపై ఆరా
- పరిశుభ్రతలో నిర్లక్ష్యం సహించబోమని అధికారులకు హెచ్చరికలి



**కల్హేర్, జూలై 29 (ప్రజాజ్యోతి):**
కల్హేర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ ప్రాంగణమంతా పరిశీలించిన ఆయన గదులు, వంటగది, భోజనశాల, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ల అనంతరం విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారికి అందుతున్న - మిగతా3లో

# నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:**
గత వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం నల్లవాగు ప్రాజెక్టును సందర్శించి, నీటి మట్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రాజెక్టు పరిస్థితులను అడిగి తెలుసుకొని, సంబంధిత అధికారులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ శ్రీనివాస్ రావు, శ్యామ్ ముదిరాజ్, బండారి సాయిలు, నరేందర్ సర్పంచ్, వినోద్ పాటిల్, మాజీ సీడీసీ చైర్మన్ నరసింహారెడ్డి, మోహన్ రెడ్డి, జిత్తు రెడ్డి, జైరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, పురుషోత్తం, జలీల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ

**- మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:**
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ.. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సమయంలో వారికి ఇబ్బందులు కలగకుండా, సురక్షితంగా విధులు నిర్వర్తించేందుకు రెయిన్‌కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద మహేందర్, లక్ష్మణ్, బాణాపురం రాజు, మహేష్, షారుక్, గోపాల్ రెడ్డి, మైతాబ్, సుబూర్, కో–ఆప్షన్ సభ్యులు ముంతాజ్, నగేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

వరద నీటిలో మునిగిన 'దూప్ సింగ్ తాండా' బాట!

నత్తనడకన బ్రిడ్జి పనులు: బాహ్య ప్రపంచంతో తెగిపోయిన మెదక్ జిల్లా 'దూప్ సింగ్ తాండా' సంబంధాలు

వానొస్తే ప్రాణాలు గుప్పెట్లో పట్టుకోవాల్సిందే!

అధికారుల ఉదాసీనతపై తాండావాసుల ఆగ్రహం



**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండలం దూప్ సింగ్ తాండా వాసులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి లంబాడ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు దూప్ సింగ్ తాండా వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తాండాకు వెళ్లే ప్రధాన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా.. కాంట్రాక్టర్ తీరు మాత్రం మారడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దూప్ సింగ్ తాండా ప్రజలకు వానాకాలం వచ్చిందంటే చాలు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాంట్రాక్టర్ ఘోర నిర్లక్ష్యం వల్ల ఏళ్లుగా బ్రిడ్జి పనులు అరకొరగానే మిగిలిపోయాయి. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి బ్రిడ్జి పైనుంచి వరద నీరు పోటెత్తింది. దీంతో బాహ్య ప్రపంచంతో తాండాకు సంబంధాలు తెగిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు, రోజువారీ పనులకు వెళ్లే కూలీలు వర్షం వస్తే చాలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉన్న లంబాడ ప్రజలు ప్రతి వర్షాకాలంలోనూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఈ వరద నీటిని దాటాల్సి వస్తోంది. ఏళ్లు మారుతున్నా,పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా తమ తలరాత మాత్రం మారడం లేదని లంబాడ సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బ్రిడ్జ్ నిర్మాణంపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం,కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి నిలిచిపోయిన బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తమ రాకపోకల తిప్పలను తప్పించాలని దూప్ సింగ్ తాండా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బొడ్మట్ పల్లి సర్పంచ్‌పై డిపిఓకు వార్డు మెంబర్లు ఫిర్యాదు

ఆరునెలల్లోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్

నిధుల దుర్వినియోగం పై మొన్న ఎంపీడీవో కు, నిన్న డిపిఓ కు ఫిర్యాదు

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్న వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు



**టేక్మాల్ ( ప్రజాజ్యోతి) జూలై 29:** మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ పంచాయతీ నిధులు దుర్వినియోగం పై జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకు బుధవారం గ్రామ వార్డు మెంబర్లు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నిధులను విచ్చలవిడిగా విత్ డ్రా చేసిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. గ్రామానికి సంబంధించిన నిధులను దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనతో సర్పంచ్ చేతివాటం ప్రదర్శిస్తున్నారని , ప్రజల సొమ్మును కాజేస్తున్నారని కొన్ని నిధులకు పంచాయతీ తీర్మానం లేకుండానే విత్ డ్రా లు చేశారని వార్డు సభ్యులు అంటున్నారు. గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని వార్డు మెంబర్లు ఆరోపించారు.పని చేయని వార్డుల్లో పని చేసినట్లు బిల్లులు తయారు చేసుకొని తనకు ఇష్టం వచ్చినట్టుగా విత్ డ్రాలు చేస్తున్నారని అంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి వార్డు మెంబర్లమైన మేము పంచాయతీ లెక్కలు అడగగా నీ స్థాయి ఎంత నువ్వెంత నాకు లెక్కలు అడిగే స్థాయి కాదునిది అని హేళన చేస్తూ చాలా అవమానపరిచారని అన్నారు. ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ చేత రికవరీ చేయించి గ్రామ ప్రజలందరికీ పంచాయతీలో ఉన్న నిధుల గురించి తెలియజేసి న్యాయం చేయాలని వారు కోరారు. మొన్న ఎంపీడీవో సత్యనారాయణకు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేదన్నారు. కావున తమరు ఈ నిధులపై పూర్తి విచారణ జరపాలని వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు.ఆరు నెలలోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు మెంబర్లు కంకర భూషణం, గడ్డం గోపాల్, మహమ్మద్ కరీం, నాయకులు డప్పు పెంటయ్య ఉన్నారు.

## మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నరసింహ చారి, కార్యదర్శిగా సంగమేశ్వర్ ఘన విజయం!

ఉత్కంఠభరితంగా మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు నరసింహ చారి, సంగమేశ్వర్ ప్యానెల్ గెలుపు




**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. క్లబ్‌లోని మొత్తం 98 ఓట్లకు గాను.. 96 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు సమయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.?అధ్యక్ష పదవికి జరిగిన హోరాహోరీ పోరులో నరసింహ చారికి 54 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ప్రకాష్ 42 ఓట్లు సాధించారు. దీంతో నరసింహ చారి 12 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు.?అలాగే జనరల్ సెక్రటరీ పదవికి జరిగిన పోటీలో సంగమేశ్వర్ 52 ఓట్లు సాధించి, 44 ఓట్లు పొందిన తన సమీప ప్రత్యర్థిపై 8 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహ చారి, జనరల్ సెక్రటరీ సంగమేశ్వర్‌లకు సహచర పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్యానెల్ ప్రతినిధులు వెల్లడించారు.

## కాసాల రైతు వేదిక నందు విత్తనమేల జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

**హత్నూర 29జూలై (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని కాసాల క్లస్టర్ రైతు వేదికలో బుధవారం నాడు రైతులతో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మేలైన విత్తనాలని రైతు ముంగిట్లో ఉంచడం జరిగింది. సెప్టెంబర్ అక్టోబర్ మాసాలలో సూపర్ ఎల్ నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షాలు తక్కువగా ఉన్నందున వరి పంటను తగ్గించి ఇతర ప్రత్యామ్నాయ పంటలైన కంది, జొన్న, ఆముదం ,ఇతర పప్పు దినుసులు పంట వేయాలని సూచించారు. మరియు భూగర్భ జలాలు అడుగంటుతున్న కారణంగా బోర్ల కింద వరి సాగు చేసే రైతులు తక్కువ మోతాదులో వరి నాట్లను వేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పండరి గారు మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితుల్లో ఆయిల్ పంటను సాగు చేసుకోవాలని సూచించారు. వరి ఒక ఎకరం పండే నీటితో ఆయిల్ ఫామ్ నాలుగు ఎకరాలు పంట సాగు చేయవచ్చని మరియు దీనికి చట్టబద్ధత గల కనీసం మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది కాబట్టి రైతులు ఆయిల్ పంప్ పంట సాగుపై ఆసక్తి చూపాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మెజిస్ట్రేట్ కార్యదర్శి సౌజన్య గారు మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసులు మరియు వాటి యొక్క చట్టాలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ సౌజన్య గారు మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసులు మరియు వాటి యొక్క చట్టాలకు వివరించడం జరిగిందిదీనిలో భాగంగా రైతు చట్టాలు సైబర్ క్రైమ్ ఫోక్సో చట్టం,భూ తగాదాల సమస్యల గురించి వివరించడం జరిగింది. మరియు ఇతర న్యాయ సలహాలు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ అరుణ గారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే బెట్ట పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జర

# ఎస్ఐఆర్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..

స్థానికంగానే ఓటు నమోదు చేసుకోవాలి.

ఇతర రాష్ట్రాల ప్రజలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి



**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)** మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమ ఓటు హక్కును స్థానికంగానే నమోదు చేసుకుని నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హుడూ తప్పనిసరిగా పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రాజస్థాన్, గుజరాత్, శ్రీకాకుళం, రాయలసీమ ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు వివిధ రంగాల వ్యాపారవేత్తలు, సంఘాల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 సంవత్సరాల అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పటాన్‌చెరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమ ఓటును స్వస్థలాల్లో కాకుండా స్థానికంగానే నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలంటే స్థానిక ఓటరుగా నమోదు కావడం అవసరమని సూచించారు. పటాన్‌చెరు భిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలకు నిలయమైన మినీ ఇండియాగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరినీ సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తూ అభివృద్ధి ఫలాలను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన పటాన్‌చెరును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియడానికి మరో ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, విజయ్ కుమార్, బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, దామోదర్ రెడ్డి, తేజ, రాజు, రామ్మోహన్‌తో పాటు వివిధ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నవంబర్‌లో నా పొలిటికల్ డిజైన్ ప్రకటిస్తా..

# జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 29:** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో జూలై నెలలో కీలక విషయం వెల్లడిస్తానని చెప్పిన ఆయన, తాజాగా తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన 'పొలిటికల్ డిజైన్' ను నవంబర్‌లో ప్రకటిస్తానని వెల్లడించారు. గత మూడున్నరేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాలపై తాను మౌనం పాటించడానికి గల కారణాన్ని కూడా వివరించారు. బుధవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలో 40 మంది ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారని, అందులో తనకు కూడా ఆహ్వానం లభించిందన్నారు. ఆ సమావేశంలో రాహుల్ గాంధీతో సుమారు 15 నిమిషాల పాటు ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం దక్కిందని చెప్పారు. సంగారెడ్డి రాంనగర్‌లోని రాంమందిర్ నుంచి విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన తన రాజకీయ ప్రయాణం, నేడు ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసంలో ఆయన ఎదురుగా కూర్చొని మాట్లాడే స్థాయికి చేరిందని వివరించినట్లు తెలిపారు. ఆ సందర్భంగా రాహుల్ గాంధీ తనతో మాట్లాడుతూ.. 'పార్టీలో ఎవరిపైనా అసంతృప్తి లేదా కోపం ఉంటే మీడియా ముందు మాట్లాడొద్దు.. నేరుగా ఢిల్లీకి వచ్చి నాతో మాట్లాడండి' అని సూచించారని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి గత మూడున్నరేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగానూ, పార్టీ వేదికలపైనూ పెద్దగా వ్యాఖ్యలు చేయలేదన్నారు. గతంలో పార్టీలో లోపాలు కనిపించినప్పుడు వాటిని బహిరంగంగానే ప్రస్తావించానని, కార్యకర్తల సమస్యలు, పార్టీ వ్యవహారాలపై కూడా మాట్లాడానని గుర్తు చేశారు. అయితే ఇటీవల రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఏసి) సమావేశాల్లో చర్చించిన అంతర్గత విషయాలు కూడా బయటకు వస్తుండటంతో అలాంటి సమావేశాలకు హాజరుకావడం మానేశానన్నారు. తాను సమావేశాలకు వెళ్లి ఉంటే పార్టీ పరిస్థితులను ఏఐసీసీ ఇన్‌చార్జి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేవాడినని, కానీ తన అభిప్రాయాలు బయటకు వచ్చే పరిస్థితి ఉండటంతో దూరంగా ఉన్నానని వివరించారు. తనకు రాజకీయంగా ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని, దానికి అనుగుణంగా ప్రత్యేకమైన పొలిటికల్ డిజైన్ సిద్ధం చేసుకున్నానని జగ్గారెడ్డి తెలిపారు. రాబోయే మూడు నెలల్లో రాజకీయంగా పూర్తి స్పష్టత వస్తుందని, అనంతరం నవంబర్‌లో తన నిర్ణయాన్ని ప్రజలకు వెల్లడిస్తానన్నారు. తన జీవితంలో కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని, ప్రజా సమస్యలు, రాజకీయాల గురించే 24 గంటలు ఆలోచిస్తానని పేర్కొన్నారు. జగ్గారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై మరోసారి చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ఆయన ప్రకటించిన "పొలిటికల్ డిజైన్" ఏ రూపంలో ఉండబోతోందన్న అంశంపై కాంగ్రెస్ శ్రేణులతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలకు పార్టీ అధిష్ఠానం లేదా ఇతర నేతలు ఎలా స్పందిస్తారన్నది కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

## వ్యాస పౌర్ణమి మహోత్సవం..
## శతరుద్రాభిషేకంతో ఆధ్యాత్మిక వైభవం

వేదమంత్రాల నడుమ మహా చండీయాగం.. భక్తి తరంగాలతో మార్మోగిన శ్రీ లలితా పరమేశ్వరీ ఆలయం

ఆలయ వ్యవస్థాపకులు, దేవి ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ దురంధరులు బ్రహ్మ శ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 29 :** తూప్రాన్ పట్టణ పరిధిలోని వెంకటాపురంలో వెలసిన శ్రీ లలితా పరమేశ్వరీ దేవీ ఆలయం వ్యాస పౌర్ణమి పర్వదినాన భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మికతతో కళకళలాడింది. ఆలయంలో నిర్వహించిన విశేష పూజలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేశాయి. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, అమ్మవారి చతుష్షష్ట్యుపచార పూజ, శ్రీ లక్ష్మీ గణపతి రుద్ర సహిత 1370వ చండీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో జన్మించిన చిన్నారులకు భక్తిశ్రద్ధలతో తులాభారం నిర్వహించగా, గురు పూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు, దేవి ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ దురంధరులు బ్రహ్మ శ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ గారికి వారి శిష్యులు భక్తి పూర్వకంగా పాదపూజ నిర్వహించి గురుభక్తిని చాటుకున్నారు. వేదమంత్రాల నడుమ సాగిన ఈ కార్యక్రమాలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. కార్యక్రమం అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు. వ్యాస పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం ప్రతి భక్తునిలో భక్తి భావాన్ని మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండాపూర్ మండలంలో జలసిరి పనుల పరిశీలన.

ఫామ్‌పాండ్‌ల నిర్మాణాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ పాండు.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలో జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పండు బుధవారం పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి (సీఈఓ) కె. జానకి రెడ్డి, మండల ప్రత్యేక అధికారి (ఎంఎస్‌వో) కొండాపూర్, ఏపీడీ జహీరాబాద్, ఎంపీడీవో పూజ, ఎంపీడీవో సౌమ్యశ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు ఫామ్‌పాండ్‌ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి, వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# సంగారెడ్డి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు





**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి మండలం కులగూర్ శివారులోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రధానోపాధ్యాయులు పల్లె పెంటా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ?అనంతరం సమావేశంలో ప్రసంగించిన వక్తలు... సమాజ నిర్మాణంలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, గురువు స్థానం దైవంతో సమానమని పేర్కొన్నారు. గురుపూజోత్సవ విశిష్టతను విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. ?ఈ సందర్భంగా పాఠశాల విద్యాభివృద్ధికి, విద్యార్థుల క్రమశిక్షణకు నిరంతరం కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నరసింహ గౌడ్‌ను యాజమాన్యం, అతిథులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

?ఈ వేడుకల్లో ప్రముఖులు శ్రీనివాస్ గౌడ్, రాజయ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:** గురు పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ మండలంలోని పంచగామా గ్రామంలో ఉన్న పంచవటి పుణ్యక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పంచవటి పుణ్యక్షేత్ర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కాశీనాథ్ బాబాను దర్శించుకున్నారు. పండ్లు, శాలువా, పూలమాలలతో సత్కరించి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గురువుకు అత్యున్నత స్థానం ఉందన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే గురువులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను కలిగించడంతో పాటు సమాజంలో సద్భావనను పెంపొందిస్తుందని అన్నారు. ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందిన పంచవటి పుణ్యక్షేత్ర అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కాశీనాథ్ బాబా ఆశీర్వాదాలతో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రాంతం సుభిక్షంగా వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వినోద్ పాటిల్, హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ అధ్యక్షుడు, అశోక్ రెడ్డి (పీఏసీఎస్ చైర్మన్), గోపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చెరువును తలపిస్తున్న నారాయణఖేడ్ బైపాస్ రోడ్డు

నీటిలో నిలబడి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి నిరసన





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్డు పూర్తిగా నీటమునిగి చెరువును తలపించేలా మారిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆరోపించారు. బుధవారం బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే నిలబడి ఆయన నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని విమర్శించారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ..తన ఎమ్మెల్యే హయాంలో బైపాస్ రోడ్డు సహా అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, ప్రభుత్వం మారిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరించి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్లపై ఒత్తిడి కారణంగా పనులు నిలిచిపోయాయని విమర్శించారు.

బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి సమీపంలో పాఠశాలలు, ఆసుపత్రులు ఉండటంతో విద్యార్థులు, రోగులు, వృద్ధులు, గర్భిణీలు ప్రాణభయంతో ప్రయాణిస్తున్నారని అన్నారు. పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రోడ్లు గుంతలమయంగా మారాయని, వర్షాల కారణంగా నీరు నిలిచి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య నిర్వహణలో విఫలమైందని, చెత్త తొలగింపులో నిర్లక్ష్యం కారణంగా దుర్వాసన, దోమల సమస్య పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని విమర్శించారు.

తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు అవసరమైన నీటి ట్యాంకులు నిర్మించామని, ప్రస్తుతం ఆ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజల సమస్యలను ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించాలని, దెబ్బతిన్న రోడ్లను అత్యవసరంగా పునర్నిర్మించాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు లయక్, రాజు నాయక్, రవీందర్ రెడ్డి, మల్గొండ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సంత్ తపస్వి శ్రీ రామ్ రావు మహారాజ్ జయంతి వేడుకలు





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:** సంత్ తపస్వి శ్రీ రామ్ రావు మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ నారాయణఖేడ్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సంత్ తపస్వి శ్రీ రామ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ..సంత్ శ్రీ రామ్ రావు మహారాజ్ తన జీవితాన్ని సమాజ శ్రేయస్సు కోసం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి మనిషి సమానమే అనే సందేశాన్ని ఆయన ప్రజల్లో నాటారని అన్నారు. సేవాభావం, మానవత్వం, సత్యం, ధర్మం, క్రమశిక్షణ, ప్రేమ, ఐక్యత వంటి విలువలను సమాజంలో పెంపొందించేందుకు మహారాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి యువత మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, ఐక్యత పెంపొందించడంతో పాటు శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహనీయుల ఆశయాలను కేవలం జయంతి, వర్ధంతి రోజుల్లో మాత్రమే కాకుండా నిత్యజీవితంలో ఆచరించినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని ప్రతి తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి, తాగునీరు, రహదారులు, రవాణా వంటి మౌలిక సదుపాయాలను కల్పించామని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం నారాయణఖేడ్ పట్టణ సమీపంలో సంత్ రామ్ రావు మహారాజ్ ట్రస్ట్‌కు 20 గుంటల భూమిని కేటాయించడంతో పాటు బంజారా భవనం మరియు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పరమేష్, విట్టల్‌రావు పటేల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సేట్, మాజీ సర్పంచులు రాజశేఖర్ రెడ్డి, రాజు నాయక్, రవీందర్, మాజీ ఎంపీటీసీ నారాయణ, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ వెంకట్, బంజారా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కల్హేర్ లోని ఆధునిక గ్రంథాలయం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





**కల్హేర్, జూలై 29 (ప్రజాజ్యోతి):** కల్హేర్ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన నూతన గ్రంథాలయ భవనంలో జరుగుతున్న పుస్తకాల, ఫర్నిచర్ ఏర్పాటు పనులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం పరిశీలించారు. విద్యార్థులు, పాఠకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి గ్రంథాలయాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు మెరుగైన సన్నద్ధత సాధించేందుకు ఈ ఆధునిక గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీఎస్సీ, గ్రూప్స్, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన ప్రామాణిక పుస్తకాలతో పాటు రోజువారీ దినపత్రికలు, మాసపత్రికలు, సాహిత్య గ్రంథాలు, నవలలను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో నాణ్యమైన ఫర్నిచర్, సరిపడా లైటింగ్, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్హేర్ మండల ప్రజలు, విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా కాళీమాతను దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 29:** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్ దక్షిణ కాళీమాతగా ప్రసిద్ధి చెందిన జగదీశ్వర్ మహారాజ్ ఆశ్రమంలో కాళీమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురు జగదీశ్వర్ మహారాజ్ ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా నగేష్ షెట్కర్ మాట్లాడుతూ.. గురు పౌర్ణమి ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సద్బుద్ధిని, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. గురువులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సేవాభావం, సత్సంకల్పం, మానవతా విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు ప్రకాశ్ రాథోడ్, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద మహేందర్, లక్ష్మణ్, పండు, సర్పంచ్‌లు, బంజారా సోదరులు, భక్తులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హాస్టల్‌లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, ఉత్తమ విద్యా వాతావరణం కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్‌లు కోడి గంగారం, వై. రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, మాజీ మండల అధ్యక్షుడు పోచయ్య, జిత్తు రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.